క్లుప్తంగా

ఎంఈఓ బాధ్యతల స్వీకరణ

కోడుమూరు రూరల్: కోడుమూరు ఎంఈఓ–2గా అనంతయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంఈఓ–2గా పనిచేసిన తైమూర్‌బాషా పదవీ విరమణ చేశారు. దీంతో మండలంలో సీనియర్ ఉపాధ్యాయుడు, గతంలో ఎంఈఓగా బాధ్యతలు నిర్వహించిన అనంతయ్యను ఉన్నతాధికారులు కోడుమూరు ఎంఈఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంఈఓ బాధ్యతలు స్వీకరించిన అనంతయ్యను కార్యాలయ సిబ్బంది పూలమాల, దుశ్శాలువాతో సత్కరించారు.

తహసీల్దార్ కార్యాలయ సబార్డినేట్ మృతి


షాలుమియా (ఫైల్)

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సబార్డినేట్‌గా పనిచేస్తున్న షాలుమియా (47) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఆయన 1998లో తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా విధుల్లో చేరి వివిధ మండలాల్లో పని చేశారు. సోమవారం తీవ్ర అనారోగ్యానికి గురైన షాలుమియాను కుటుంబ సభ్యులు కర్నూలు ఆసుపత్రికి తరలించారు. హైబీపీతో ఆయన కోలుకోలేక ఆసుపత్రిలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సబార్డినేట్ మృతి చెందిన విషయం తెలుసుకున్న సి.బెళగల్ డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తం, ఆర్ఐ తరుణ్, వీఆర్వోలు, వీఆర్ఏలు మృతుడి స్వగ్రామమైన గూడూరుకు చేరుకుని మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మృతుడికి ఓ కుమారుడు, కుమార్తె సంతానం ఉన్నారు.

విద్యార్థిని ప్రతిభ

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ సమీపంలో ఉన్న కాకతీయ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థిని దివ్యశ్రీ తైక్వాండోలో ప్రతిభ కనపరచినట్లు మాస్టర్ వెంకటేశ్వర్లు, కోచ్ నాగన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు విజయవాడలోని రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీ ల్లో విద్యార్థిని దివ్యశ్రీ సిల్వర్ మెడల్ దక్కించుకుందన్నారు. అలాగే 20వ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. విద్యార్థినిని పాఠశాల ప్రిన్సిపాల్ దేవిక అభినందించారు.

జేడీఏలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు (న్యూటౌన్): జిల్లాలోని వ్యవసాయ కార్యాలయంలో రూ.93 లక్షలు కాజేసిన ఇద్దరు వ్యవసాయ శాఖ జేడీఏలపై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె జగన్నాథం సోమవారం ఒక ప్రకటనలో జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. 2016– 2019 మధ్య జేడీఏలుగా ఉన్న ఠాగూర్‌నాయక్, ఉమామహేశ్వరమ్మ, రాజేష్ అనే వ్యక్తి, మరికొంతమంది కలిసి కాజేసిన జాతీయ ఆహార భద్రతా మిషన్ నిధులు రూ.93 లక్షలను రికవరీ చేసి ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులను సమీకరించి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

కౌలు కార్డులు జారీ చేయాలి

కల్లూరు: కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం కౌలు రైతుల సమస్యలపై తహసీల్దార్ ఆంజనేయులుకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలవుతున్నా కౌలు గుర్తింపు కార్డులు ప్రభుత్వం జారీ చేయకపోవడంతో పంట రుణాలు, పంటల బీమా పథకం వర్తింప చేయడంలేదన్నారు.

నదీ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు(రూరల్): తుంగభద్ర నదికి భారీగా నీరు విడుదలవుతున్న క్రమంలో నదీ తీర ప్రాంతంలోని 12 గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు రూరల్ తహసీల్దార్ రమేష్ బాబు సూచించారు. నదికి దాదాపు లక్ష క్యూసెక్కుల నీరు వస్తోందని, తీరంలోని సుంకేసుల, ఆర్.కె.దుద్యాల, ఎదురూరు, ఆర్.కొంతలపాడు, జి.సింగవరం, నిడ్జూరు, పంచలింగాల, ఈ.తాండ్రపాడు, గొందిపర్ల, దేవమాడ, పడిదెంపాడు, పూడూరు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నది వైపు వెళ్లరాదని, చేపల వేటకు నదిలోకి దిగరాదని సూచిస్తూ గ్రామాల్లో దండోరా వేయించారు. అలాగే ప్రార్థన మందిరాల్లో గ్రామ పెద్దలతో అవగాహన కల్పించారు.


పాఠశాల సమస్యల పరిష్కారానికి చర్యలు

పాణ్యం: గిరిజన గురుకుల బాలుర పాఠశాల సమస్యలకు శాశ్విత పరిష్కారం చూపేందుకు ప్రతిపాదనలు పంపాలని అధికారుల బృందం నిర్ధారించారు. ఇటీవల పాఠశాలలో విరేచనాలతో దాదాపు 25 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలైన విషయం తెలిసిందే. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్, ప్రిన్సిపాల్స్ క్రిష్టానాయక్, సలోమీ, ఐటీడీఏ ఇంజినీర్లు ప్రదీప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధుశేఖర్ పాఠశాలను సందర్శించి సమస్యలను గుర్తించారు. వాటి పరిష్కారంపై చర్చించారు. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మినరల్ వాటర్‌ప్లాంట్ మరమ్మతులు, డైనింగ్‌హాల్, మరుగుదొడ్లు నిర్మాణం, వంట గది ఎత్తు పెంచడం, పరిసరాలు శుభ్రం తదితరు పనులకు ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. పాఠశాల నూతన భవనానికి సుగాలిమెట్టలో కేటాయించిన 5 ఎకరాల్లో నిర్మాణం కోసం ఇది వరకే రూ.18 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

వ్యవ‘సాయం’ శూన్యం

- కూటమి ప్రభుత్వంలో రైతన్నలకు మొండిచేయి
- అదును దాటిపోతున్నా అందని అన్నదాత సుఖీభవ సాయం
- చేతిలో చిల్లిగవ్వ లేక అప్పుల కోసం రైతుల పాట్లు
- గతంలో సకాలంలో సాయం అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

నమ్మించి నట్టేట ముంచడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి తన నైజాన్ని చాటుకున్నారు. రైతులకు అండగా నిలుస్తామని అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల ముందు ఉపన్యాసాలతో ఊదరగొట్టారు. అధికారం చేపట్టి 13 నెలలు దాటినా ఆ ఊసే ఎత్తడం లేదు. గతేడాది అన్నదాత సుఖీభవ సాయం ఎగ్గొట్టారు. ప్రస్తుతం ఖరీఫ్‌లో అదును దాటి పోతున్నా పెట్టుబడి సాయం అందించలేదు. దీంతో చేతిలో చిల్లిగవ్వ లేక అప్పుల కోసం రైతన్నలు పడరాని పాట్లు పడుతున్నారు.



కర్నూలు(రూరల్): ఎలాగైనా అధికారంలోకి రావాలన్న తపనతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో అమలుకు సాధ్యం కాని హామీలన్నీ గుప్పించారు. పాలన పగ్గాలు చేపట్టి ఏడాది దాటినా హామీల ఊసే ఎత్తడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేసిన రైతు భరోసా పథకాన్ని అన్నదాత సుఖీభవగా పేరు మార్చారు తప్ప రైతులకు ఒక్క రూపాయి కూడా విదల్చలేదు. అలాగే రైతుల సంక్షేమం కోసం ఒక్క పథకాన్ని కూడా అమలు చేయలేదు. ఖరీఫ్ అదును దాటిపోతుండటంతో అన్నదాత సుఖీభవ సాయం ఎప్పుడిస్తారని అడిగితే అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప పథకం అమలులో స్పష్టత కొరవడింది. దీంతో ఖరీఫ్ పంటల సాగుకు చేతిలో చిల్లి గవ్వ లేక రైతన్నలు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. హామీలను నమ్మి పూర్తిగా మోసపోయామని కూటమి నాయకుల మాటలకు, చేతలకు పొంతనే లేదని విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

గతంలో సకాలంలో సాయం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఖరీఫ్ సాగు మొదలుకాక ముందే రైతు భరోసా పథకం కింద అన్నదాతలకు ఆర్థిక సాయం అందించడంతో ఐదేళ్ల పాటు వ్యవసాయం పండుగలా సాగింది. నాడు ఏటా రైతులకు రూ.13,500 అందేది. అయితే కూటమి పెద్దలు ఎన్నికల సమయంలో రైతన్నలకు ఏటా రూ.20 వేలు అందిస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చి 13 నెలలు దాటినా ఇప్పటివరకు కనీస సాయం అందించకపోవడంతో పంటల సాగుకు పెట్టుబడి కోసం చేతిలో చిల్లిగవ్వ లేక అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు.

కౌలు రైతులకు దక్కని భరోసా

భూమి లేని రైతులు, కౌలుకు భూములను సాగు చేస్తున్న వారికి కూడ వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సకాలంలో అందించింది. అయితే నేడు అవేవీ అమలు చేయకుండా రద్దు చేయడంతో కౌలు రైతులు పథకాలన్నింటికీ దూరమై గగ్గోలు పెడుతున్నారు.

నాడు రైతు భరోసా ఇలా..

నియోజకవర్గంలోని సి.బెళగల్, గూడురు, కోడుమూరు, కర్నూలు రూరల్ మండలాల్లో దాదాపు 45,831 హెక్టర్ల వ్యవసాయ భూమి ఉంది. అర్హత కలిగిన 38,753 మంది రైతులకు వైఎస్సార్ సీపీ హయాంలో రైతు భరోసా పథకం ద్వారా రూ.49,06,47,500 నగదును వారి ఖాతాల్లో జమ చేశారు. రైతులను ఆర్థికంగా ఆదుకోవాలనే లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ సాయం రూ.7,500, కేంద్ర సాయం రూ.6000 కలుపుకుని ఏడాదికి రూ.13,500 మొత్తాన్ని మూడు విడతలుగా రైతుల ఖాతాల్లో జమ చేసేవారు. అలాగే సొంత భూమి లేని కౌలు రైతులకు కూడా రైతు భరోసా సాయం అసరాగా నిలిచింది. పంట సీజన్‌లోనే ఆర్థిక సాయం అందించడం, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, మద్దతు ధర కల్పించడంతో వ్యవసాయం పండుగలా మారింది.

అదిగో.. ఇదిగో.. అంటూ కాలయాపన

నియోజకవర్గంలో ఈ ఎడాది ముందస్తుగా వర్షాలు కురవడంతో పాటు చెరువులు, కేసీ కెనాల్, హంద్రీనీవా కాలువ, తుంగభద్ర నది, హంద్రీకి నీరు చేరడంతో రైతులు పంటల సాగుకు సిద్ధమయ్యారు. అప్పొ, సొప్పొ చేసి విత్తనాలు నాటారు. ప్రస్తుతం వ్యవసాయానికి ఎరువులు, మందులు, కూలీల ఖర్చులకు నగదు అవసరం. ఈ స్థితిలో చేతిలో డబ్బులేక అష్టకష్టాలు పడుతున్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన రైతు భరోసా పథకాన్ని కూటమి సర్కారు పేరు మార్చి అన్నదాత సుఖీభవ అని నామకరణం చేసిందే తప్ప అమలు చేయడంలో స్పష్టత కొరవడింది. ఏడాది నుంచి ఇస్తామని చెబుతున్నా నేటి వరకు విధి విధానాలు వెల్లడించకపోవడం చూస్తే పాలకుల చిత్తశుద్ధి ఏ పాటిదో అర్థమవుతోంది. మొదట జూన్ 20న ఇస్తామన్నారు, తర్వాత 21న ఇస్తామని ప్రకటించారు. అయితే అవన్నీ గడిచిపోయి జూలై నెల ముగుస్తున్నా ఇప్పటివరకు రైతులకు ఒక్క రూపాయి కూడా విదల్చలేదు. అసలు ఈ పథకం అమలు చేసే ఉద్దేశం ప్రభుత్వానికి ఉందా? అనే సమాచారం కూడా లేదు. గతేడాది దిగుబడులకు మద్దతు ధర లభించకపోవడం, అంతంత మాత్రంగానే దిగుబడులు రావడంతో రైతుల చేతిలో చిల్లిగవ్వ లేక పంటల సాగుకు అప్పులు చేయాల్సి వస్తోంది.

జూన్‌లో ఇస్తామని ఎగ్గొట్టారు



కూటమి ప్రభుత్వం ఏడాది నుంచి ఇస్తామని చెబుతున్నా నేటికీ అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయలేదు. మొదట జూన్ 20వ తేదీ ఇస్తామన్నారు. తర్వాత 21వ తేదీ అన్నారు. ఇప్పుడు జులై గడిచిపోతున్నా ఒక్క పైసా ఇవ్వలేదు. ఎప్పుడిస్తారో స్పష్టత లేదు. గతేడాది సాయం ఎగ్గొట్టారు. ఈ ఏడాది రబీ నాటికైనా పథకాన్ని అమలు చేస్తారా అని అనుమానంగా ఉంది. పెట్టుబడుల కోసం ఇప్పటికే రైతులు అప్పుల పాలయ్యారు. చెప్పిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి గతేడాది బకాయిలతో కలిపి సాయం అందించాలి.

– శ్రీనివాస్ రెడ్డి, రైతు, ఉల్చాల గ్రామం

ఇంకెప్పుడు ఇస్తారు?



కూటమి నాయకులు ఈ ఎడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే అన్నదాత సుఖీభవ పథకం నిధులు రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. నేటి వరకు వాటి గురించి ప్రభుత్వం ఊసే ఎత్తడం లేదు. మండలంలో ముందస్తు వర్షాలకు రైతులు అప్పులు తెచ్చి పంటలు సాగు చేశారు. ప్రస్తుతం పైర్లకు ఎరువులు, కూలీలు వంటి ఖర్చులకు డబ్బు లేక దిక్కుతోచక అల్లాడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవాలి.

– జి.రామకృష్ణ, రైతు, శివరామాపురం

నేడు శింగరయ్య స్వామి రథోత్సవం


సద్గురు సింగరయ్య స్వామి మూలవిరాట్

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామంలో వెలిసిన సింగరయ్య స్వామి వారి జయంతి ఉత్సవాలకు సోమవారం అలయ సేవకులు రాజారత్నం అంకురార్పన చేశారు. నాగ పంచమి రోజు స్వామి వారి జన్మదినం కావటంతో 186వ జయంతి ఉత్సవాలను గ్రామంలో మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలకు మండల ప్రజలతోపాటు ఇతర రాష్ట్రాలు, జిల్లాలు, ప్రాంతాల నుంచి కూడా భక్తులు భారీగా పోలకల్‌కు చేరుకుంటున్నారు. నాగుల పంచమి సందర్భంగా మంగళవారం ఉదయం సింగరయ్య ఆలయంలో గంగాగోవు పూజలు, కుంకుమార్చన కార్యక్రమాలను పురోహితులు నిర్వహిస్తారు. గోన నగర ప్రదక్షిణ, ఆలయ ప్రవేశం, కలశ ప్రతిష్ట, పంచామృతాభిషేకం, గణపతిపూజ, నామ మంత్ర హోమం, సామూహిక కుంకుమార్చన, నాగదోష పరిహార పూజలుంటాయి. అదేవిధంగా 11 గంటలకు గీతా పారాయణం, మధ్యాహ్నం 2 గంటలకు అన్నపూర్ణ పూజ, అఖండ అన్న సంతర్పణ అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుంది. సాయంత్రం 6 గంటలకు శింగరయ్య స్వాముల వారి మహారథోత్సవం నిర్వహిస్తారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి


వినతిపత్రం అందిస్తున్న సీపీఐ, రైతు సంఘాల నాయకులు

కోడుమూరు రూరల్: భూములను కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసే రైతులందరికీ ప్రభుత్వం వెంటనే గుర్తింపు కార్డులు ఇవ్వాలని సీపీఐ మండల కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలని కోరుతూ సోమవారం కోడుమూరులోని గ్రామ సచివాలయం–1లో కౌలు రైతులతో కలిసి సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా కౌలు గుర్తింపు కార్డులను ప్రభుత్వం మంజూరు చేయకపోవడంతో కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుర్తింపు కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పంట బీమా, బ్యాంకు రుణాలకు దూరమవుతున్నారని, ప్రభుత్వం స్పందించి కౌలు గుర్తింపు కార్డులను అందజేయాలని కోరారు. స్థానిక సీపీఐ, రైతు సంఘం నాయకులు శేషుకుమార్, రాజు, గుంటిప్ప, వెంకటేష్, బాలు, మూగన్న, నాగయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు మంజూరు చేయాలి


వేతనాలపై అధికారులతో మాట్లాడుతున్న పారిశుద్ధ్య కూలీలు

సి.బెళగల్: తమకు గత ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, వెంటనే మంజూరు చేయాలని గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కూలీలు అధికారులను కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో కలిసి ఎంపీడీఓ రాణెమ్మ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలపై అధికారులకు వినతి పత్రాలు ఇచ్చారు. తమకు 6 నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కుటుంబ పోషణ, జీవనం భారంగా మారిందని, వెంటనే మంజూరు చేయాలని పారిశుద్ధ్య కూలీలు ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీఓ మహేశ్వరిని కోరారు. సి.బెళగల్‌లోని డాక్టర్ నాయుడు కాలనీవాసులు జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా తమ కాలనీలో ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఇవ్వాలని, ఎంపీడీఓకు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్‌ను కోరారు. మండలంలోని మారందొడ్డి గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం నిర్మించి, గ్రామ స్థాయి ఉద్యోగులు గ్రామంలోనే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరారు. కార్యక్రమానికి హౌసింగ్ ఏఈ సుమంత్, ఏపీఓ రామన్న హాజరయ్యారు. అదేవిధంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తం పీజీఆర్ఎస్‌ను నిర్వహించగా ఆయా గ్రామాల రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించాలని అర్జీలను ఇచ్చారు. కార్యక్రమంలో వీఆర్వోలు ఉన్నారు.


సర్టిఫికెట్లపై విచారణ చేయండి

కర్నూలు (న్యూటౌన్): ఈ ఏడాది మెగా డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయులు (ఎస్‌ఏపీఈ, పీఈటీ)గా ఎంపికయ్యే అభ్యర్థుల సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆంధ్రప్రదేశ్ వ్యాయామ విద్య పోరాట సమితి స్టేట్ సెక్రటరీ ఈ దేవేంద్రగౌడు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. వ్యాయామ విద్య శిక్షణ తీసుకోకుండా, ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూ డైరెక్ట్‌గా పరీక్ష రాసి సర్టిఫికెట్ పొందారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

గడివేముల: ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ వెంకటరమణ, ఏఓ పవన్‌కుమార్ రైతులకు సూచించారు. సోమవారం గడివేముల పరిధిలో జరుగుతున్న ఈ పంట నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పంట నమోదుకు ప్రతి రైతు సహకరించాలన్నారు. పంట నమోదు చేసుకున్న రైతులకు ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టం పరిహారం అందుతుందన్నారు. కార్యక్రమంలో వీఆర్వో ప్రసాద్‌నాయుడు, వీఏఏ జయరాజ్ పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమం పట్టని ప్రభుత్వం


చిరిగిన బ్యాగులను చూపుతున్న వైఎస్సార్‌ఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

సి.బెళగల్: కూటమి ప్రభుత్వానికి పేద విద్యార్థుల సంక్షేమం పట్టదని వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర నాయకుడు మణిరెడ్డి అన్నారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సంక్షేమ బాట కార్యక్రమంలో భాగంగా సి.బెళగల్‌లోని ఎస్సీ, బీసీ హాస్టళ్లను ఆయన జిల్లా అధ్యక్షులు రెడ్డిపోగు ప్రశాంత్, కార్యవర్గ సభ్యులతో కలిసి సందర్శించారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థులకు అందుతున్న భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం అందించిన స్కూల్ బ్యాగ్‌లు చిరిగిపోయి ఉండడాన్ని గమనించి, విద్యాభివృద్ధి, బాలల సంక్షేమంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ప్రశ్నించారు. గత వైఎస్సార్‌సీపీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందించిన స్కూల్ బ్యాగ్‌ల నాణ్యతను విద్యార్థులు పోల్చి నాయకులకు చూపించారు. హాస్టల్‌లో మంచినీరు, గదుల సమస్యలను వైఎస్సార్‌ఎస్‌యూ నాయకుల దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్ల నిర్వహణను గాలికి వదిలేసిందని విమర్శించారు. వైఎస్సార్‌ఎస్‌యూ జిల్లా కార్యవర్గ సభ్యులు తిరుమలేష్, నాయకులు గణేష్, నబీరసూల్, సంతోష్, మధుమోహన్, హేమంత్, దీపురెడ్డి, సుమన్, మల్లికార్జున, శేఖర్, అర్జున్ తదితరులు ఉన్నారు.

పొగాకును కొనుగోలు చేయాలి

కర్నూలు (న్యూటౌన్): జిల్లాలో మిగిలిన పొగాకును కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పొగాకు రైతులు అర్ధనగ్నంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఎమ్మిగనూరు, వెల్దుర్తి, ఓర్వకల్లు, కల్లూరు మండలాల్లో పొగాకు సాగు చేసిన రైతుల వద్ద దిగుబడులను కొనుగోలు చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా, నాలుగు నెలలుగా ఆందోళన చేస్తున్నా పొగాకును ప్రైవేట్ కంపెనీలతో ప్రభుత్వం కొనుగోలు చేయించలేకపోవడం సిగ్గుచేటన్నారు. అనంతరం కలెక్టర్ రంజిత్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం సహాయ కార్యదర్శులు కృష్ణ, సూరి, జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతు, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, మధు, మహేష్, మల్లేష్, మద్దిలేటి పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి కృషి

కర్నూలు(రూరల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో రైతులు అందజేసిన అర్జీల పరిష్కారానికి కృషి చేస్తామని కర్నూలు రూరల్ తహసీల్దారు టీ.వీ.రమేష్‌బాబు అన్నారు. మండలంలోని ఆర్.కొంతలపాడు, బసాపురం, గార్గేయపురం, ఆర్.కె.దుద్యాల, ఉల్చాల, రేమట, నందనపల్లె, పి.రుద్రవరం, బి.తాండ్రపాడు, నూతనపల్లె, దిన్నెదేవరపాడు, ఆయా గ్రామాల వారు తమ సమస్యలపై సోమవారం కర్నూలు రూరల్ తహసీల్దారు కార్యాలయంలో అర్జీలు అందజేశారు. మొత్తం 11 అర్జీలు మ్యూటేషన్, పాస్ పుస్తకాలు, భూమి సర్వే తదితర సమస్యలపై అందినట్లు తహసీల్దార్ తెలిపారు. అర్జీలపై విచారణ జరిపి పరిష్కరించాలని వీఆర్వోలను ఆదేశించారు.

దర్యాప్తు వేగవంతం చేయాలి

కర్నూలు (న్యూటౌన్): కర్ణాటకలోని మంజునాథ ఆలయం ధర్మస్థలంలో వందలాది మంది యువతులు, మహిళలపై జరిగిన దారుణమైన అత్యాచారం, హత్యోదంతం ఘటనలపై దర్యాప్తు వేగవంతం చేయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గిడ్డమ్మ డిమాండ్ చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలంటూ సోమవారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలోని కొంతమంది మత గురువులుగా చలామణి అవుతూ మహిళల మానప్రాణాలను హరిస్తున్నారన్నారు. అధికారం, డబ్బు, పలుకుబడితో నేరాలు బయటపడకుండా నిర్దోషులుగా చలామని అవుతుండనడానికి ప్రత్యక్ష సాక్ష్యం ధర్మస్థల ఉదంతమేనన్నారు. సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షురాలు రేణుక, నగర అధ్యక్షురాలు నాగేంద్రమ్మ, కార్యదర్శి భారతి, నగర నాయకులు పావని, విజయ, సుధా, కోటమ్మ, వెంకటేశ్వరమ్మ, సులోచనమ్మ, చంద్రకళ, ఆశాబేగం, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి సాగుతో లాభాలు


రైతులకు కొబ్బరి మొక్కలను అందజేస్తున్నట్లు ఏపీఓ శేషన్న

పాణ్యం: కొబ్బరి సాగుతో లాభాలు సాధించవచ్చని ఏపీఓ శేషన్న రైతులకు సూచించారు. సోమవారం ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు కొబ్బరి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొబ్బరి, మామిడి, చీనీ, నేరేడు తదితర పండ్లతోటలు సాగు చేసుకుంటే ఉపాధి హామీ పథకం ద్వారా రాయితీలు అందుతాయన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన


ఆర్‌సీకే సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వర్లు, ఏడీఏ సాలురెడ్డి

కోడుమూరు రూరల్: పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించేలా రైతు సేవా కేంద్రాల సిబ్బంది స్థానిక రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం గూడూరులో కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల్లో రైతు సేవా కేంద్రాల సిబ్బందికి జీవన ఎరువుల వినియోగం, సమగ్ర సస్యరక్షణ చర్యలపై జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు వెంకటేశ్వర్లు, ఏడీఏ సాలురెడ్డి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కింద రైతులు సాగు చేసిన పత్తి పంటలో రసం పీల్చే పురుగు, దోమల నివారణ, గులాబీరంగు పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతు సేవా కేంద్రాలు సంపూర్ణ కలిగి ఉండాలన్నారు. ఏడీఏ సాలురెడ్డి మాట్లాడుతూ.. అంతర పంటల వల్ల కలిగే లాభాలు, పంటల యాజమాన్య పద్ధతులపై సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఓలు దస్తగిరిరెడ్డి, రవిప్రకాష్, మల్లేష్, కర్నూలు సాంకేతిక ఏఓ శ్రీవర్ధన్‌రెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ మదన్‌మోహన్, ఆయా మండలాల ఏఈఓలు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలి


సీడీపీఓ ఆఫీసు ఎదుట నిరసన చేపట్టిన అంగన్‌వాడీ వర్కర్స్

కర్నూలు (న్యూటౌన్): అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు నిర్మలమ్మ డిమాండ్ చేశారు. సోమవారం సీడీపీఓ ఆఫీసు ఎదుట అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు విజయమ్మ అధ్యక్షతన నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నిర్మలమ్మ మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కష్టపడి పని చేస్తున్నా కనీస వేతనం అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. స్కీం వర్కర్లని చెబుతూనే సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయన్నారు. నిత్యావసరాల ధరలను బట్టి జీతాలు పెంచాలన్నారు. గతంలో కార్మికుల దీక్షా శిబిరాల వద్దకు వచ్చి హామీలిచ్చిన టీడీపీ నాయకులు.. ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా అతీగతీ లేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ వర్కర్స్ సమస్యలను అర్థం చేసుకుని పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు సాయిబాబా, సిటీ సెక్రటరీ విజయ రామాంజనేయులు, జిల్లా నాయకులు బాలదుర్గమ్మ పాల్గొన్నారు.

పింఛన్ల కోసం డప్పులు కొడుతూ నిరసన


గూడూరు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మధులతకు వినతిపత్రం ఇస్తున్న డప్పు కళాకారులు

కోడుమూరు రూరల్: కొత్త పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ కళాకారులు సోమవారం గూడూరు ఎంపీడీఓ కార్యాలయం ముందు డప్పులు కొడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి కరుణాకర్, గౌరవ అధ్యక్షులు మోహన్ మాట్లాడుతూ తరతరాలుగా అంటరానితనాన్ని భరిస్తూ సంప్రదాయ కళగా ఉన్న డప్పులను కొట్టే కళాకారుల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాది గడిచినా ఇంతవరకు డప్పు కళాకారులు పింఛన్ కోసం దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించకపోవడం దారుణమన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి డప్పు కళాకారులకు 45 ఏళ్లకే పింఛన్ మంజూరు చేయాలని, అర్హులందరికీ డప్పులు, గజ్జలు, డ్రస్సులను ఉచితంగా అందజేయాలని, ఆరోగ్య బీమా, బస్సు ప్రయాణాల్లో రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని గూడూరు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మధులతకు అందజేశారు. డప్పు కళాకారుల సంఘం నాయకులు నాగరాజు, భగవంతు, ఏసేపు, తిమ్మప్ప, వెంకటేశ్వర్లు, శేషన్న, బుడ్డన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల చవితి


నాగులకట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు


పసుపలలో పాలు పోస్తున్న మహిళలు


గడివేములలో పుట్టకు పాలు పోస్తున్న మహిళలు

సి.బెళగల్: మండలంలో ప్రజలు నాగుల చవితి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శ్రావణ మాస చవితి సందర్భంగా సోమవారం ఉదయం నుంచి మహిళలు, భక్తులు ఆయా గ్రామాల్లోని నాగుల కట్టల వద్దకు చేరుకుని నాగుల విగ్రహాలకు ప్రత్యేక పూజలను నిర్వహించి పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. నూతన వధూవరులు నాగ విగ్రహాలతో పాటు, పొలాలకు వెళ్లి పుట్టలో పాలు పోసి మొక్కుకున్నారు.

కర్నూలు(రూరల్): మండలంలోని పసుపల, నందనపల్లె, సూదిరెడ్డి పల్లె, గార్గేయపురం, బి.తాండ్రపాడు, పంచలింగాల తదితర గ్రామాల్లో భక్తులు నాగుల కట్టల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పాము పుట్టల్లో పాలుపోసి నైవేద్యం సమర్పించారు.

పాణ్యం: మండలంలో నాగులచవితి వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. మహిళలు ఉపవాసాలతో పుట్టల వద్దకు చేరుకుని పాలుపోసి మొక్కులు తీర్చుకున్నారు. కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణంలో స్వామి వారికి ఇష్టమైన చలువపండి తయారు చేసి నైవేద్యం సమర్పించారు. పాణ్యం బస్టాండ్‌లోని అంజనేయస్వామి ఆలయం పక్కన ఉన్న పుట్ట వద్ద భక్తులు ఉదయం నుంచే పూజలు ప్రారంభించారు. ఎస్సార్బీసీ కాలనీలోపాటు పాణ్యంలో ఆలయాల వద్ద ఉన్న పుట్టలకు మహిళలు పెద్ద ఎత్తున పూజలు చేశారు.

గడివేముల: మండలంలో నాగులచవితి పండుగను కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. భోగేశ్వరాలయం, బాలాజీ ఆలయం, మూలపెద్దమ్మలతోపాటు పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.ఆయా గ్రామాల్లో నాగేంద్రుడికి పుట్టలో పాలు పోసి భక్తులు కోడిగుడ్లను వదిలి భక్తిని చాటుకున్నారు.